11

# ప్రభువు సంఘము: పని

ప్రభువు సంఘము యొక్క ప్రత్యేకమైన యితర గురుతులను ప్రస్తావించవచ్చు,[1] కాని నేను యింకా ఒక దానిని మాత్రమే చర్చించుతాను. తరువాత మన పఠనంలో ఈ భాగాన్ని ముగిస్తాను.

## సంఘానికి సవాలు

సంఘము దైవికమైన పని కలిగియున్న ఒక దైవికమైన సంస్థయైయుంది. ప్రభువు తన పనిని ఈ విధంగా ఒకసారి వివరించాడు: "నశించినదానిని వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు ఈ లోకమునకు వచ్చెను" (లూకా 19:10). ఆయన సంఘానికి అదే ఉద్దేశముంది. అనేక లక్ష్యాలు ప్రాముఖ్యమైనవిగా ఉండవచ్చు. కాని ఒకటి మాత్రం తప్పనిసరి: పరలోకం వెళ్లడం. "ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకుంటే, వానికి ఏమి ప్రయోజనము?" (మత్తయి 16:26ఎ).

"నశించిన దానిని రక్షించే" సంఘపు సవాలును మూడు విధాలుగా విభజింపవచ్చు:

(1) **సువార్త ప్రకటన.** "సువార్తను ప్రకటించడమంటే" "[ప్రభువైన యేసునుగూర్చి] శుభవార్తను చెప్పడమే." సువార్తను ప్రకటించుడని ప్రభువు యిచ్చినది ఆయన ఘనత్వము గల ఉత్తరువునందు ఉంది:

> కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తివరకు సదాకాలము మీతో కూడా ఉన్నానని వారితో చెప్పెను (మత్తయి 28:19, 20).

> … "మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:15, 16).

ప్రభువైన యేసును గూర్చియు ఆయన మార్గాన్ని గూర్చియు తాను కలిసికొన్న వారికి ప్రతి క్రైస్తవుడు ఉపదేశించాలి.

(2) **క్షేమాభివృద్ధి.** "క్షేమాభివృద్ధి" అంటే "నిర్మించడం" అని అర్థం. క్రైస్తవులు ఒకరినొకరు ఉపదేశంవలనను ప్రోత్సహించుకొనడంవలనను ఏర్పరచుకోవలసియుంది. ఈ సవాలు కన్పించే చోటు ఎఫెసీ. 4:15, 16:

> ప్రేమ గలిగి సత్యము చెప్పుచు క్రీస్తువలె ఉండుటకు, మనమన్ని విషయములలో ఎదుగుదము. ఆయన శిరస్సయి యున్నాడు, ఆయననుండి సర్వశరీరము చక్కగా అమర్చబడి, తనలోనున్న ప్రతి అవయవము తన తన పరిమాణము చొప్పున పని

చేయుచుండగా ప్రతి కీలువలన గలిగిన బలముచేత అతుకబడి, ప్రేమయందు తనకు క్షేమాభివృద్ధి కలుగునట్లు శరీరమునకు అభివృద్ధి కలుగజేసికొనుచున్నది.

(3) **ధర్మ కార్యములు:** "ధర్మ కార్యములు" యితరులకు సహాయం చేయడాన్ని సూచిస్తాయి – ఎందుకంటే "మనం వారి క్షేమం కోరుతాం." ధర్మ కార్యాల్లో యితరుల యొక్క అవసరతలకు యివ్వడం, ఆహారము, వస్త్రాలువంటివాటికి సంబంధించిన భౌతిక అవసరతలను తీర్చడంతో కూడినవై యుంటాయి. ఇతరులకు సహాయం చేసే బాధ్యతను గూర్చి అనేక క్రొత్త నిబంధన లేఖనాలు మాట్లాడతాయి.

> తండ్రియైన దేవునియెదుట పవిత్రమును నిష్కళంకమునైన భక్తి యేదనగా – దిక్కులేని పిల్లలను విధవరాండ్రను వారి యిబ్బందిలో పరామర్శించుటయు, ఇహలోకమాలిన్యము తనకంటకుండ తన్ను తాను కాపాడుకొనుటయునే (యాకోబు 1:27).
>
> కాబట్టి మనకు సమయము దొరికినకొలది అందరియెడలను, విశేషముగా విశ్వాస గృహమునకు చేరినవారియెడలను మేలు చేయుదము (గలతీ. 6:10).

దేవుడు అప్పగించిన పనిని విస్మరించి లేక మరచిపోయి – ఏ స్థానిక సంఘమైనా – అనేక కార్యకలాపాలలో చిక్కుకొనిపోయే అవకాశముంది.

## నీకు ఒక సవాలు

మనం కలిసి పఠించేది ఫలభరితంగా ఉంటానికి, అది వ్యక్తిగతమయ్యింది, ఆచరించేది అయ్యుండాలి. ప్రభువు సంఘాన్ని గూర్చిన ఆరు పాఠాలను (దీనితో సహా) నీవు రివ్యూ చేయగోరుతున్నా. అప్పుడు కొన్ని మత శాఖలను, క్రొత్త నిబంధన ప్రభువు సంఘాన్ని గూర్చి చెప్పిన దానితో పోల్చి చూడు. ఈ పనికొరకు నీవు ఏ మత శాఖనైనా ఉదాహరణగా తీసికోవచ్చు (అది నీవు యిష్టపడేదే కావచ్చు యిష్టపడకపోయేదే కావచ్చు). ఇందులో తారతమ్యం చూడాలని నీవు ప్రోత్సహింపబడతావు. అట్టి పోలికలో సహాయపడడానికి గాను, ప్రశ్నల జాబితాను నీవు తయారుచేసికోవచ్చు.

ఈలాటి సాధారణమైన ప్రశ్నలను నీవు అడుగ గోరతావు:

- ఇది దేవునియందును, క్రీస్తునందును, బైబిలునందును విశ్వసిస్తూ దేవునికి భయపడే సంఘమేనా?
- దేవుని ఆనందింపజేయడానికిని, మనుష్యులను బలపరచడానికిని సమర్పించుకున్న సంఘమేనా?

మన పఠనానికి సంబంధించిన ప్రత్యేకమైన ప్రశ్నలు నీవు అడుగగోరవచ్చు:

- ఈ సంఘము లేఖనానుసారమైన పేరును ధరించిందా?
- ఈ సంఘము లేఖనానుసారంగా నిర్వహింపబడుతుందా?
- దాని సువార్తికులు ''పాష్టర్లని'' పిలువబడుతున్నారా? వారు లేఖనానుసారంకాని "రెవరెండ్" వంటి బిరుదులను కలిగియున్నారా?
- ఈ సంఘం లేఖనానుసారంగా ఆరాధిస్తుందా? ప్రతి ఆదివారమున అది

ప్రభురాత్రి భోజనాన్ని ఆచరిస్తుందా? ఆరాధనలో అది కేవలం గాత్ర సంగీతాన్నే ఉపయోగిస్తుందా?

ప్రశ్నల జాబితాను నీవు తయారు చేసికొనేటప్పుడు, సంఘం యొక్క హృదయానికి సంబంధించిన వాటిని నీవు అలక్ష్యము చేయవద్దు. ప్రభువు యిలా అన్నాడు,

> ... నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణమనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననునదియే. ఇది ముఖ్యమైనదియు మొదటిదియునైన ఆజ్ఞ. నిన్నువలె నీ పొరుగువాని ప్రేమింపవలెనను రెండవ ఆజ్ఞయు దానివంటిదే (మత్తయి 22:37-39).

ఈలాటి ఆజ్ఞలకు లోబడేలా నీవు ప్రోత్సహింపబడేచోట నీవు ఆరాధించి పని చేయగోరతావు కదా.

ఈ ప్రయాసలో భాగంగా, క్రీస్తు ప్రభువు యొక్క స్థానిక సంఘంతో నీ జాబితాను పోల్చిచూడు. క్రీస్తు సంఘాలు సంఘాన్ని మొదటి శతాబ్దపు సంఘానికి పునరుద్ధరించినట్టు చెప్పుకొంటున్నారు. "బైబిలు మాట్లాడే చోట తాము మాట్లాడతామని," "బైబిలు మౌనంగా ఉన్నచోట తామును మౌనంగానే ఉంటామని" క్రీస్తు సంఘాలు చెప్పుకొంటున్నాయి. వారు చెప్పుకొనే దాన్ని సవాలు చేయి (అపొ. 17:11).

## ముగింపు

ప్రభువు సంఘము దేవుని "నిత్య సంకల్పములో" భాగమైయుంది (ఎఫెసీ. 3:10, 11). "దేవుని యొక్క నానావిధమైన జ్ఞానము" "సంఘం ద్వారా తెలియ జేయబడాలి" (ఎఫెసీ. 3:10). దేవుని మహిమ సంఘంలో ప్రకాశిస్తుంది (ఎఫెసీ. 3:21). సంఘము "సత్యమునకు స్తంభమును ఆధారమునై యుంది" (1 తిమోతి 3:15). సంఘమును గూర్చిన మన పఠనము దానిని ఎక్కువగా అభినందించేలా చేసిందని నేను నిరీక్షిస్తున్నా, దేవుడు ప్రసాదించినవాటిలో అద్భుతమైనవాటిలో మరియు శ్రేష్ఠమైనవాటిలో అది ఒకటి.

నేడు ప్రభువు యొక్క సంఘాన్ని గుర్తించి, దానిలో భాగస్వామివై యుండడం బహు ప్రాముఖ్యమైనది. అనేక సంఘాలు ఉనికిలోనికి వచ్చి కలత పరుస్తున్నాయా? అవును. ఈ తారుమారు మధ్య ప్రభువు సంఘాన్ని కనుగొనడం సులభమా? లేదు. అయినా, దేవుని సహాయంతో, నీవు దాన్ని కనుగొనగలవు. "నన్ను బలపరచువానియందే నేను సమస్తమును చేయగలను" అన్న పౌలులా నిశ్చయమైన స్వభావం నీకు ఉన్నదా? (ఫిలిప్పీ. 4:13).

---

సూచనలు

[1]ప్రభువు సంఘము యొక్క వేరైన గురుతులలో అది ఎప్పుడు ఎక్కడ అనేవాటిని చేర్చవచ్చు (అపొ. 2) మరియు సంఘం యొక్క ఏకత్వపు ఉద్ఘాటన కూడా చేర్చవచ్చు (యోహాను 17:20, 21; 1 కొరింథీ. 1:10-13; ఎఫెసీ. 4:4-6).